# వడ్డీలేని రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి



2 లో...

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం | 26 | నవంబర్ | 2025 • పేజీలు : 7

# సర్పంచ్ ఎన్నికల... నోటిఫికేషన్ జారీ...

- భద్రాద్రిలో 471 పంచాయతీలు, 4,168 వార్డుల్లో ఎన్నికల సందడి
- మూడు దశల్లో పోలింగ్, 4,242 పోలింగ్ స్టేషన్లు
- 4168 వార్డుల్లో 226 మహిళా స్థానాలు..
- గ్రామాల్లో రాజకీయ వేడి మళ్లీ మొదలు

2 లో..

తెలంగాణలో గ్రామ పంచాయతీల 2వ సాధారణ ఎన్నికలకు మంగళ వారం నోటిఫికేషన్ విడుదల అయ్యింది. ఈసారి కూడా ఎన్నికలు గతంలో లాగానే మూడు దశల్లో జర గనున్నాయి. ఈ నెల 27 నుండి మొదటి విడత ఎన్నికల ప్రక్రియ మొదలవ్వగా.. డిసెంబర్ 17 న చివరి దశ ఎన్నికలు ముగియను న్నాయి. దీంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ఎన్నికల సందడి మొదలైంది.




• భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

## రాష్ట్రంలోనే మొట్టమొదటి సోలార్ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్

- - రెండు మూడు రోజుల్లో ప్లాంటు ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి
- - మందమర్రి సింగరేణి సోలార్ ప్లాంట్ లో ఏర్పాటు
- - ఏడాదికి 90 లక్షల యూనిట్ల సోలార్ విద్యుత్ సద్వినియోగం
- - సుమారు 70 లక్షల రూపాయల వరకు ఆదా
- - ట్రయల్ రన్ విజయవంతం కావ డంతో సింగరేణి వ్యాప్తంగా



- - బీఈఎస్ఎస్ ల ఏర్పాటుకు సన్నద్ధం : సీఎండీ ఎన్.బలరామ్

**కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 25 – ప్రజాజ్యోతి.** పగటిపూట ఉత్పత్తి జరిగే సోలార్ విద్యుత్తులో వినియోగించబడని విద్యుత్తును ఉచితంగా గ్రిడ్ కు సరఫరా చేయకుండా, బ్యాటరీలో నిలువ చేసుకొని, అవసరమైనప్పుడు వాడుకునే అవకాశం కలిగించే

మిగతా 2 లో...

## 28 మంది మావోయిస్టుల లొంగుబాటు

- లొంగిపోయిన మావోయిస్టులపై 89లక్షల రివార్డ్



**చర్ల, నవంబర్ 25 (ప్రజాజ్యోతి):** తెలంగాణ చర్ల సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గఢ్ నారాయణపూర్ లో నక్సలైట్లు హింసా మార్గాన్ని వదిలివేసి జనజీవన ప్రవంతిలోకి చేరుతున్నారు . ఛత్తీస్గఢ్ ప్రభుత్వం "పునా మార్గెం:పునరావాసం నుండి పునరుజ్జీవనం" చొరవ కింద సోమవారం నారాయణపూర్ జిల్లాలో 28మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో 19 మంది మహిళా మావోయిస్టులు ఉన్నారు, వీరికి మొత్తం 89లక్షల రివార్డు ప్రకటించారు.వివిధ స్థాయిల మావోయిస్టు కేడర్లకు చెందిన సభ్యులు లొంగిపోయారు. సోమవారం పునరావాసం పొందిన 28 మంది మావోయిస్టు కార్యకర్తలలో ఈ క్రింది స్థాయిల సభ్యులు ఉన్నారుమాడ్ డివిజన్ డి వి సి ఏం సభ్యుడుపీ ఎల్ జి ఏ కంపెనీ నం. 06 యొక్క సైనిక సభ్యుడు,ఏరియా కమిటీ సభ్యుడు (ఏ సి ఏం ),సాంకేతిక బృంద సభ్యుడు

మిగతా 2 లో...

## వడ్డీలేని రుణాలను మహిళలు సద్విని యోగం చేసుకోవాలి

**కొత్తగూడెం, నవంబర్ 25(ప్రజాజ్యోతి):** పొదుపు సంఘాలకు వడ్డీలేని రుణాలు అందించడం మహిళా సాధికారతకు చేయూత అందించడమేనన, మహిళలకోసం మరిన్ని పథకాలు ప్రవేశపెట్టి అమలుచేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివ రావు అన్నారు. కొత్తగూడెం క్లబ్బులో మంగళవారం జరిగిన కార్యక్రమంలో చుంచుపల్లి, పాల్వంచ, సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి మండలాల గ్రామీణ పొదుపు సంఘాల మహిళలకు ప్రభుత్వం మంజూరు చేసిన వడ్డీలేని రుణాల చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో కూనంనేని మాట్లాడుతూ వడ్డీలేని రుణాలు మహిళల ఆర్థికాభివృద్ధికి, వ్యాపార విస్తరణకు ఎంతో దోహదపడతాయని అన్నారు. ఈ నిధులను పొదుపు సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకొని, వ్యాపారాల్లో రాణించి, మరింత మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని సూచించారు. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం తనవంతు కృషి చేస్తోందని, ఈ కృషి మరింత మెరుగుపర్చి స్త్రీ శక్తిని ప్రోత్సహించాలని కోరారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ మహిళా సంఘాలు పటిష్టంగా ఉంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని, అందుకే పొదుపు సంఘాలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రోత్సహిస్తుందని, దీన్ని పూర్తిస్థాయిలో గ్రామీణ మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, చుంచుపల్లి మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి, సహకార సంఘ అధ్యక్షులు మండే హనుమంతరావు, మాజీ డిసిసిబి చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, కొత్తగూడెం తాసిల్దార్ పుల్లయ్య, అదనపు డిఆర్ డిఏ నీలేష్, చుంచుపల్లి ఎంపీడీఓ సుభాషిణి, డ్వాక్రా సంఘాలు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలోనే మొట్టమొదటి సోలార్ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్




(మొదటి పేజీ తరువాయి...)

బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ను రాష్ట్రంలోనే తొలిసారిగా సింగరేణిలో ప్రారంభించనున్నారు. పునరుత్పాదక విద్యుత్తు పెంపుదల కోసం ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి శ్రీ భట్టి విక్రమార్క మల్లు చేస్తున్న విశేషమైన కృషిలో భాగంగా సింగరేణి కాలరీస్ కంపెనీ మందమర్రి ఏరియాలో గల తన 28 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ కు అనుబంధంగా ఈ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బీఈఎస్ఎస్) ను ఇటీవల ఏర్పాటు చేసింది. ఇది ఒక మెగా వాట్ సామర్థ్యం కలిగిన ప్రయోగాత్మక ప్లాంట్. దీనిని రెండు మూడు రోజుల్లో ఈ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. – బీఈఎస్ఎస్ ఎందుకు? ఉపయోగం ఏమిటి? రాష్ట్ర ప్రభుత్వం సౌర విద్యుత్తుకు అందిస్తున్న ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకొని సింగరేణితో సహా పలు రాష్ట్ర సంస్థలు సోలార్ విద్యుత్ ను ఉత్పత్తి చేస్తున్నాయి. సింగరేణి సంస్థ ఇప్పటికే తన ఏరియాల్లో 245.5 మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసింది. ఇవి సమర్థంగా పనిచేస్తూ విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాయి. ఈ విధంగా ఉత్పత్తి చేసే విద్యుత్తును తెలంగాణ ట్రాన్స్ కో గ్రిడ్ ద్వారా అనుసంధానం చేసి సరఫరా చేస్తున్నారు. అయితే సింగరేణిలో డిమాండ్ లేని సమయాల్లో ఉత్పత్తి అవుతున్న సోలార్ విద్యుత్ ను గ్రిడ్కు ఉచితంగా సరఫరా చేయడం జరుగుతోంది. ఇలా మిగిలిపోయిన సోలార్ విద్యుత్తును పూర్తిగా సద్వినియోగం చేసుకోవడానికి బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ద్వారా నిల్వ చేసి గరిష్ట విద్యుత్ వినియోగం ఉండే సమయం లో కంపెనీ అవసరాలకు వినియోగించడం జరుగుతుంది. సాంకేతికపరంగా బీఈఎస్ఎస్ అత్యాధునికమైన సోలార్ విద్యుత్తు నిల్వ మరియు పొదుపు వ్యవస్థగా పేర్కొనవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం వారు త్వరలో పెద్ద ఎత్తున సుమారు 250 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని సంకల్పించిన నేపథ్యంలో మందమర్రిలో సింగరేణి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 1 మెగావాట్ బ్యాటరీ ఎనర్జీ సిస్టమ్ ఒక తొలి అడుగుగా భావించవచ్చు. సుమారు 2.73 కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ వలన సింగరేణి సంస్థ ఏడాదికి సుమారుగా వినియోగించబడని 9.1 లక్షల యూనిట్ల సోలార్ విద్యుత్తును సద్వినియోగం చేసుకుంటూ 70 లక్షల రూపాయల వరకు ఆదా చేసుకునే అవకాశం ఏర్పడుతుంది. రాష్ట్రంలో అనేక సోలార్ విద్యుత్తు ప్లాంట్లు ఉన్నప్పటికీ తొలిసారిగా బీఈఎస్ఎస్ ఏర్పాటు చేసే అవకాశం తమకు కల్పించినందుకు సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ ఎండీ ఎన్. బలరామ్, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి , ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు లకు తమ ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో సింగరేణి వ్యాప్తంగా అనువైన చోట్ల ఈ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

# సర్పంచ్ ఎన్నికలకు.. నోటిఫికేషన్ జారీ..

తెలంగాణలో గ్రామ పంచాయతీల 2వ సాధారణ ఎన్నికలకు మంగళవారం నోటిఫికేషన్ విడుదల అయ్యింది. ఈసారి కూడా ఎన్నికలు గతంలో లాగానే మూడు దశల్లో జరగనున్నాయి. ఈ నెల 27 నుండి మొదటి విడత ఎన్నికల ప్రక్రియ మొదలవ్వగా..డిసెంబర్ 17 న చివరి దశ ఎన్నికలు ముగియనున్నాయి. దీంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ఎన్నికల సందడి మొదలైంది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 471 పంచాయతీలు, 4,168 వార్డులు ఉన్నాయి. వీటి ఎన్నికల నిర్వహణకు 4,242 పోలింగ్ స్టేషన్లను అధికారులు ఏర్పాటు చేశారు. ప్రతి దశలో మండలాల వారీగా పంచాయతీలు, వార్డులు, పోలింగ్ ఏర్పాటు వివరాలను జిల్లా అధికారులు ప్రకటించారు. ప్రధానంగా వీటిలో 226 స్థానాలు మహిళలకు కేటాయించడం ప్రత్యేక చర్చగా మారింది. మహిళా రిజర్వేషన్లు పెరగడంతో పలుచోట్ల పోటీస్థితి మారిపోగా, కొన్ని గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థుల లెక్కలు పూర్తిగా రివర్స్ అయ్యింది. సర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్ తో జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో మళ్లీ పాత చర్చలు, కొత్త ఆశలు, వర్గ సమీకరణాల మధ్య గ్రామీణ ప్రజాస్వామ్యం మరోసారి కదలిక వచ్చింది.

**♦ తెలంగాణలో గ్రామ పంచాయతీల 2వ సాధారణ ఎన్నికలు – 2025**

### 1వ దశ పోలింగ్ – 159 పంచాయతీలు

మొదటి దశలో జిల్లాలోని వ్యూహాత్మకంగా కీలకమైన మండలాలు ఉన్నాయి. అశ్వాపురం, చర్ల–దుమ్ముగూడెం, పినపాక, మణుగూరు బెల్ట్ లో ఈ దశలో పోటీ తీవ్రంగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయి. మొదటి విడతకు నవంబర్ 27 నామినేషన్ ప్రక్రియ మొదలవ్వగా డిసెంబర్ 11 న ఎన్నికలు నిర్వహిస్తారు. అదే రోజు ఫలితాలను కూడా విడుదల చేస్తారు.

| మండలం | పంచాయతీలు | వార్డులు | పోలింగ్ స్టేషన్లు |
|---|---|---|---|
| అశ్వాపురం | 24 | 214 | 214 |
| భద్రాచలం | 1 | 20 | 60 |
| బూర్గంపాడు | 18 | 182 | 200 |
| చెరియా | 26 | 232 | 232 |
| దుమ్ముగూడెం | 37 | 324 | 324 |
| కరకగూడెం | 16 | 130 | 130 |
| మణుగూరు | 14 | 132 | 148 |
| పినపాక | 23 | 202 | 202 |

**1వ దశ మొత్తం: 159 పంచాయతీలు – 1,436 వార్డులు – 1,510 పోలింగ్ స్టేషన్లు**

### 2వ దశ పోలింగ్ – 156 పంచాయతీలు

అశ్వారావుపేట, దమ్మాపేట, పాల్వంచ వంటి రాజకీయంగా ముఖ్యమైన మండలాలు ఈ దశలో ఉండటం ప్రత్యేకత. పాత రైవల్రీలు, కమ్యూనిటీ సమీకరణాలు, అభివృద్ధి వాగ్దానాలు ఈ దశను మరింత ఆసక్తికరంగా మార్చనున్నాయి. రెండవ విడతకు నవంబర్ 30 న నామినేషన్ ప్రక్రియ మొదలవ్వగా డిసెంబర్ 14 న ఎన్నికలు నిర్వహిస్తారు. అదే రోజు ఫలితాలను కూడా విడుదల చేస్తారు.

| మండలం | పంచాయతీలు | వార్డులు | పోలింగ్ స్టేషన్లు |
|---|---|---|---|
| అన్నపురెడ్డిపల్లి | 10 | 98 | 98 |
| అశ్వారావుపేట | 27 | 234 | 234 |
| చంద్రుగొండ | 14 | 134 | 134 |
| చుంచుపల్లి | 18 | 168 | 168 |
| దమ్మాపేట | 31 | 290 | 290 |
| ములకలపల్లి | 20 | 186 | 186 |
| పాల్వంచ | 36 | 282 | 282 |

**2వ దశ మొత్తం: 156 పంచాయతీలు – 1,392 వార్డులు – 1,392 పోలింగ్ స్టేషన్లు**

### 3వ దశ పోలింగ్ – 156 పంచాయతీలు

టేకులపల్లి, ఇల్లందు, లక్ష్మీదేవిపల్లి వంటి పెద్ద పంచాయతీలున్న మండలాలు ఈ దశలో ఉన్నాయి. సుజాతనగర్ అర్బన్–పెరివరి ప్రాంతాలు కూడా ఈ దశలో ఉండటం రాజకీయ దృష్టిలో కీలకం. మొదటి విడతకు డిసెంబర్ 03 న నామినేషన్ ప్రక్రియ మొదలవ్వగా డిసెంబర్ 17 న ఎన్నికలు నిర్వహిస్తారు. అదే రోజు ఫలితాలను కూడా విడుదల చేస్తారు.

| మండలం | పంచాయతీలు | వార్డులు | పోలింగ్ స్టేషన్లు |
|---|---|---|---|
| ఆళ్లపల్లి | 12 | 90 | 90 |
| గుండాల | 11 | 96 | 96 |
| జూలూరుపాడు | 24 | 198 | 198 |
| లక్ష్మీదేవిపల్లి | 31 | 260 | 260 |
| సుజాతనగర్ | 13 | 110 | 110 |
| టేకులపల్లి | 36 | 312 | 312 |
| యెల్లందు | 29 | 274 | 274 |

**3వ దశ మొత్తం: 156 పంచాయతీలు – 1,340 వార్డులు – 1,340 పోలింగ్ స్టేషన్లు**

జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికలు పెద్దఎత్తున లాజిస్టిక్స్, భద్రతా ఏర్పాట్లను అవసరం చేస్తుండగా అధికారులు ఇప్పటికే ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. గ్రామాల్లో నోటిఫికేషన్ ప్రకటించగానే వాతావరణం మారిపోయి—— వర్గాల కదలికలు, అభ్యర్థుల సమీకరణాలు, విభేదాల నివారణ చర్చలతో రాజకీయ వాతావరణం ఉత్కంఠ భరితంగా మారింది.

**మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు —— పూర్తి షెడ్యూల్**

**రెండవ సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలు – 2025**

| కార్యక్రమం | 1వ దశ | 2వ దశ | 3వ దశ |
|---|---|---|---|
| ఎన్నికల నోటీసు జారీ | 27.11.2025 | 30.11.2025 | 03.12.2025 |
| ఓటర్ల జాబితా ప్రదర్శన | 27.11.2025 | 30.11.2025 | 03.12.2025 |
| నామినేషన్ల చివరి తేదీ | 29.11.2025(సా 5 గం) | 02.12.2025 (సా 5 గం) | 05.12.2025 (సా 5 గం) |
| నామినేషన్ల పరిశీలన | 30.11.2025 | 03.12.2025 | 06.12.2025 |
| చెల్లుబాటు జాబితా | 30.11.2025 సా. 5 తరువాత | 03.12.2025 సా. 5 తరువాత | 06.12.2025 సా. 5 తరువాత |
| అప్పీళ్లకు చివరి తేదీ | 01.12.2025 | 04.12.2025 | 07.12.2025 |
| అప్పీళ్ల పరిష్కారం | 02.12.2025 | 05.12.2025 | 08.12.2025 |
| నామినేషన్ ఉపసంహరణ | 03.12.2025 (మ 3 గం) | 06.12.2025 (మ 3 గం) | 09.12.2025 (మ 3 గం) |
| పోటీ అభ్యర్థుల జాబితా విడుదల | 03.12.2025 | 06.12.2025 | 09.12.2025 |
| పోలింగ్ తేదీ | 11.12.2025 (ఉ 7– మ 1 గం) | 14.12.2025 (ఉ 7– మ 1 గం) | 17.12.2025 (ఉ 7– మ 1 గం) |
| ఓట్ల లెక్కింపు | 11.12.2025 (మ 2 గం నుండి) | 14.12.2025 (మ 2 గం నుండి) | 17.12.2025 (మ 2 గం నుండి) |
| ఫలితాల ప్రకటన | అదేరోజు ఉండనుంది. దానితో పాటు ఉపసర్పంచ్ను కూడా అదే రోజు ఎన్నుకోవలసి ఉంటుంది. | | |

# 28 మంది మావోయిస్టుల లొంగుబాటు

(మొదటి పేజీ తరువాయి...)

,సైనిక ప్లాటూన్ పీ పీ సి ఏం ,సైనిక ప్లాటూన్ సభ్యుడు,ఎస్ జెడ్ సి ఏం యొక్క గార్డ్ బృందం భాస్కర్ —— పార్టీ సభ్యుడు (పీ ఏం ),సరఫరా బృందం సభ్యుడు (పీ ఏం ),ఎల్ ఓ ఎస్ సభ్యుడు (పీ ఏం ),జంతన సర్కార్ సభ్యుడు ఉన్నారు .ఆయుధాలను పునరావాస సమయంలో ముగ్గురు మావోయిస్టు కేడర్లు కూడా వారి ఎస్ ఎల్ ఆర్ , ఐ యెన్ ఎస్ ఏ ఎస్ , 303 రైఫిళ్లను భద్రతా దళాలకు అప్పగించారు.

**2025లో ఇప్పటివరకు 287 మంది మావోయిస్టులు లొంగిపోయారు:**నారాయణపూర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రాబిన్సన్ గుడియా మాట్లాడుతూ, నేటి చర్య తర్వాత, 2025 సంవత్సరంలో ఇప్పటివరకు, 287 మంది మావోయిస్టు కార్యకర్తలు హింస మార్గాన్ని విడిచిపెట్టి జిల్లాలో జనజీవన స్రవంతిలోకి చేరారని అన్నారు.

**మావోయిస్టు భావజాలం ముగింపు దశలో ఉంది : బస్తర్ ఐజీ**

బస్తర్ రేంజ్ ఇన్ స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుందర్ రాజ్ పట్టిలింగం మాట్లాడుతూ నారాయణ్ పూర్ లో 28 మంది మావోయిస్టు కేడర్లకు పునరావాసం కల్పించడం హింసాత్మక ప్రజా వ్యతిరేక మావోయిస్టు భావజాలం ముగింపు దగ్గర పడిందని నిరూపిస్తుందని అన్నారు. ప్రజలు "పూనా మార్గెం: పునరావాసం ద్వారా పునరుజ్జీవనం" చొరవను విశ్వసిస్తున్నారు అని శాంతి, గౌరవం శాశ్వత పురోగతి మార్గాన్ని ఎంచుకుంటున్నారు అని అన్నారు . ఛత్తీస్ గఢ్ ప్రభుత్వం, భారత ప్రభుత్వం, బస్తర్ పోలీసులు స్థానిక పరిపాలన భద్రతా దళాలు ఈ ప్రాంతంలో శాంతిని నెలకొల్పడానికి పునరావాసం కల్పించడానికి సమగ్ర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడానికి పూర్తిగా కట్టుబడి ఉన్నాయి అని అన్నారు .గత 50 రోజుల్లో, బస్తర్ పరిధిలోని 512 కంటే ఎక్కువ మంది మావోయిస్టు కార్యకర్తలు హింసను విడిచిపెట్టి జనజీవన స్రవంతిలో చేరాలని నిర్ణయించుకోవడం మంచిపరిణామం అని అన్నారు . పొలిట్ బ్యూరో సభ్యుడు దేవ్ జీ, కేంద్ర కమిటీ సభ్యుడు రాందార్, డీకేఎస్ జెడ్ సీ సభ్యులు పప్పారావు, దేవా (బార్సే దేవా) ఇతరులతో సహా మిగిలిన మావోయిస్టు కార్యకర్తలు హింసను త్యజించి జనజీవన స్రవంతిలో చేరడం తప్ప వేరే మార్గం



# అంతర పంటలపై రైతులు దృష్టి సారించాలి





- **మంత్రి తుమ్మల రైతు నేస్తం వీడియో కాన్ఫిరెన్స్ లో పాల్గోన్న ఎమ్మెల్యే**

**ఇల్లెందు, నవంబర్ 25, ప్రజాజ్యోతి:** రైతులు అంతర పంటలపై దృష్టిసారించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు సూచించారు. మండలంలోని రేపల్లెవాడ రైతు వేదికలో మంత్రి తుమ్మల వీడియో కాన్ఫరెన్స్ లో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య హాజరయ్యారు. ప్రభుత్వం సబ్సిడితో అందిచే నూతన అధిక దిగుబడి వరి వంగడాల పంపిణిని ప్రారంభించారు.వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా రైతుల వద్ద నుండి మంత్రి సలహాలు, సూచనలు తీసుకున్నారు. ముసాయిదా విత్తనాల సిడ్స్ 2025, ముసాయిదా సీడ్స్ 1966 చట్టాల గురించి అధికారులు రైతులకు అవగాహన కల్పించారు.కేంద్ర ముసాయిదా చట్టంలో రైతులకు ఉపయోగపడేవి, రాష్ట ప్రభుత్వానికి ఉండే హక్కులపై రైతుల నుండి సలహాలు స్వీకరించారు. అనంతరంరేపల్లెవాడ మహిళ సంఘాల సభ్యులకు ఎమ్మెల్యే చీరలను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మన్ బానోత్ రాంబాబు, మాజీ వైస్ ఎంపిపి మండల రాము, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పులి సైదులు, కామేపల్లి సొసైటి చైర్మన్ పుచ్చకాయల వీరభద్రం, డిఏఓ బాబురావు, ఏఓ సతీష్, టెక్నికల్ ఏఓ రామకృష్ణ, బిటియం రేవతి, ఏఈఓ సందీప్, నాయకులు కాకటి భార్గవ్, పూనెం సురేందర్, ఫతే మహ్మద్, తాటి భిక్షం, పోటు రవి, బానోత్ శారద, పూనెం శ్రీ రాములు, బింగి కృష్ణ, మాజీ సర్పంచులు కల్తీ పద్మ, పాయం స్వాతి, నాయకులు గాలిపల్లి స్వరూప, ప్రసన్న కుమార్ యాదవ్, కోటి, తూర్పటి కనకయ్య, నాగుల్ మీరా, ముక్తి ముత్తయ్య, వరసభద్రం, వల్లాల రాజయ్య, మోడెం కోటయ్య, సట్ల శ్రీను, బానోత్ సోమ్లా, మహబత్తిని రమణ, కుర్ర శ్రీను, దొంతు వెంకన్న, ముక్తి సుర్యానారయణ, రైతులు పాల్గొన్నారు.

## దీక్ష దివాస్ కు శ్రేణులు అధిక సంఖ్యలో హాజరు కావాలి



**ఇల్లందు, నవంబర్ 25, ప్రజాజ్యోతి:** ఈనెల 29న జరగనున్న దీక్ష దివాస్ కు బిఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరు కావాలని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు కోరారు. మంగళవారం కొత్తగూడెంలో తెలంగాణ భవన్ లో జరిగిన సన్నాహక సమావేశానికి మాజీ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్ నాయకత్వంలో శ్రేణులు బయలుదేరి వెళ్లారు. నవంబర్ 29న కేసిఆర్ చావు నోట్లో తల పెట్టి సాధించిన తెలంగాణ విజయ గాథను స్మరించుకుంటూ జరుపుకునే పండుగకు ఇల్లందు పట్టణ నాయకులు, కార్యకర్తలు కదిలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ జబ్బార్, టీబీజీకేఎస్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్ రంగనాథ్, నాయకులు అబ్దుల్ నబీ, అజ్మీర భావు సింగ్ నాయక్, నారపాక వసంతరావు, లలిత్ కుమార్ పాసి, డేరంగుల పోశం, రాచపల్లి శ్రీను, కడగంచి వీరస్వామి, సన రాజేష్, చిన్నారి, రవి గౌడ్, సుందరగిరి శ్రీను, పాలడుగు రాజశేఖర్, మునగంటి శివ, వంగ సునీల్, శ్రీకాంత్, బోడ రామకృష్ణ, మదార్ బి, మహమ్మద్ నూర్జాన్, మహమ్మద్ బీబీ, మూలగుండ్ల ఉపేందర్ రావు పాల్గొన్నారు.

## నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలి





**ఇల్లెందు, నవంబర్ 25, ప్రజాజ్యోతి:** బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడలు వెంటనే రద్దు చేయాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఏరియా ఉపాధ్యక్షుడు జాఫర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఇల్లందు ఏరియా వర్క్ షాప్ ఆవరణలో నల్ల బ్యాడ్జీలతో సింగరేణి ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత పారిశ్రామిక రంగాన్ని దేశ విదేశీ పెట్టుబడిదారులకు అప్పనంగా అప్పగించేందుకు దోపిడి శక్తులను ఎదురు లేకుండా చేయడానికి కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను తొలగించి 4 చట్ట స్వభావం లేని కోడ్ లుగా మార్చడాన్ని కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ కుట్రకు వ్యతిరేకంగా సింగరేణి కార్మిక సంఘాలన్ని తిరస్కరిస్తూ ఆందోళనలు, సమ్మెలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అదేవిదంగా రేపు జరగబోయే జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు, సాయంత్రం 4 గంటలకు అన్ని జనరల్ మేనేజర్ కార్యాలయాల ముందు ధర్నా కార్యక్రమాన్ని పాల్గొనాలని కోరారు. అనంతరం కోడ్ ప్రతులను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమాల్లో జెఏసి నేతలు నజీర్ అహ్మద్, మహబూబ్, జక్కుల శీను, మధు, యుగంధర్, భట్టు రవి, జమీల్, జరీనా, చంద్రకళ, రజిని శాంతి, నవ్య, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ చరిత్ర మలిచిన రోజు నవంబర్ 29



**ఇల్లందు, నవంబర్ 25, ప్రజాజ్యోతి:** తెలంగాణ చరిత్ర మలిచిన రోజు నవంబర్ 29 అని మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ అన్నారు. మంగళవారం ఇల్లందు బిఆర్ఎస్ నియోజకవర్గ కార్యాలయంలో ఇల్లందు నియోజకవర్గ ముఖ్య నాయకులతో నవంబర్ 29 దీక్షా దివస్ సందర్భాన్ని పురస్కరించుకొని సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు దీక్ష దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. తెలంగాణ చరిత్రలో మైలురాయిగా, రాష్ట్ర సాధనలో పవిత్ర దినంగా నిలిచిన రోజు నవంబర్ 29 అని భారత రాష్ట్ర సమితి అధినేత తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ వచ్చుడో–కెసిఆర్ సచ్చుడో అనే నినాదంతో చేపట్టిన ఈ దీక్ష దేశ రాజకీయాలను కదిలించిందని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రాణ త్యాగానికైనా వెనుకాడకుండా ఆమరణ నిరాహార దీక్ష చేసి మన తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ భావి భారత తెలంగాణ పౌరులకు తెలంగాణ రాష్ట్రాన్ని బహుమతిగా అందించి తెలంగాణ ప్రజల చేతిలో ఉంచారని దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత తెలంగాణ బిడ్డలుగా మన అందరి మీద ఉందన్నారు. ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్లు జెకె శ్రీనివాస్, కటకం పద్మావతి, తోట లలితా శారదా, వాంకుడోత్ తార, ఇల్లందు, గార్ల, కామేపల్లి మండలాల అధ్యక్షులు శీలం రమేష్, గంగావత్ లక్ష్మణ్ నాయక్, అంతోటి అచ్చయ్య, నాయకులు సిలివేరు సత్యనారాయణ, పరుచూరి వెంకటేశ్వర్లు, లకావత్ దేవిలాల్ నాయక్, గంగుల సత్యనారాయణ, మల్లంపాటి శ్రీనివాస్, బోడ బాలు నాయక్, బర్మావత్ లాల్ సింగ్, దాస్యం ప్రమోద్, ఖమ్మం పాటి రేణుక, బండారి శ్రీనివాస్, పోనుగంటి రాధాకృష్ణ, శీలంశెట్టి. రమేష్, వల్లాల మంగమ్మ, నెమలి ధనలక్ష్మి, కొక్కు సరిత, కడగండ్ల నారాయణమ్మ, పింకీ లోదు, రెహనా, ఘాజీ, మసూద్ రబ్బు, గిన్నారపు రాజేష్ సత్తాల హరికృష్ణ, భూక్యా సురేష్, నీలం రాజశేఖర్, పాబోలు మణి కిరణ్, సామల రవితేజ, వార రమేష్, కందుల రఘువీర్ రెడ్డి, లాలు, నూతక్కి వీరభద్రం, బాసాని రాములు, రవికాంత్, నెమలి నిఖిల్, డేరంగుల పోషం, పుదూరి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు కోడ్స్‌గా కుదించిన నిర్ణయాన్ని వెంటనే రద్దు చేయాలి: ఐఎన్టీయూసీ



**కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 25 – ప్రజాజ్యోతి:** కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను చట్టబద్రత లేని నాలుగు కోడ్స్‌గా కుదించిన నిర్ణయాన్ని ఖండిస్తూ ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్, తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ బి. జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు, జేఏసీ ఆధ్వర్యంలో కొత్తగూడెం ఏరియాలోని మైన్స్, ఓపెన్ కాస్ట్, మరియు డిపార్ట్మెంట్లలో ఆందోళన నిర్వహించారు. ఐఎన్టీయూసీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని తీవ్ర ఆందోళనలతో నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు, ఫిట్ కార్యదర్శిల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ వైస్ ప్రెసిడెంట్ యండి.రజాక్, జాక్ నాయకులు పాల్గొని, దేశీయ పారిశ్రామిక రంగాన్ని దేశ–విదేశీ పెట్టుబడిదారులకు ధారాధత్తం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ, కొత్తగూడెం ఏరియా బొగ్గు గనుల్లో, ఓపెన్ కాస్ట్ గనుల్లో మరియు డిపార్ట్మెంట్లలో కార్యాలల్లో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి ర్యాలీలు నిర్వహించారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ గని యాజమాన్యాలకు మెమోరాండాలు సమర్పించి, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు కోడ్స్ పత్రాలను దహనం చేయడం ద్వారా తీవ్ర నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జెఏసి నాయకులు సెంట్రల్ కమిటీ నాయకులు బ్రాంచ్ కమిటీ నాయకులు ఫిట్ కార్యదర్శిలు ఆర్గనైజ్ సెక్రటరీ ఆల్ కమిటీ మెంబర్స్ పాల్గొని విజయవంతం చేశారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే మహిళల అభివృద్ధి సాధ్యం

- **రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల**

**పాల్వంచ(టౌన్),నవంబర్ 25(ప్రజా జ్యోతి):** పాల్వంచ సొసైటీ అధ్యక్షులు, రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్,డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు మహిళల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందని తెలిపారు.మంగళవారం పాల్వంచ మండలం పరిధిలోని జగన్నాధపురం, కేశవాపురం గ్రామాల్లో నిర్వహించిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన కొత్వాల, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన రోజే మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం అందించడం,మహిళల పేరు మీద రేషన్ కార్డుల పంపిణీ,200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్, స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల వంటి పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వ ప్రత్యేకత అని చెప్పారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న గౌడ్, గంధం నరసింహారావు, జగన్నాధపురం గ్రామ సమైక్య మౌనిక, తోట రమాదేవి,మాధవి,తోట లక్ష్మీ, కుమారి,కవిత,కేశవాపురం గ్రామ సమైక్య మాలోతు సుగుణ,బండి జానకమ్మ,కళావతి,గంధం ఈశ్వరమ్మ, రాంశెట్టి లక్ష్మి,అల్లం స్వరూప,గుజ్జుల నాగమణితో పాటు గ్రామస్తులు బాలాజీ నాయక్,సతీష్,బ్రహ్మచారి, నాగేష్,ఉదయ్ కుమార్, చిన్నరాములు,రాకేష్,రమేష్, బాలాజీ,భాను ప్రసాద్,పూజారి బాబురావు,బాలకృష్ణ,నరసింహ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టర్ ను సన్మానించిన కొత్వాల



**కొత్తగూడెం, నవంబర్ 25(ప్రజాజ్యోతి ):** జాతీయస్థాయిలో జల్ సంచయ్ – జన్ భాగీధారి అవార్డును పొందడాన్ని హర్షిస్తూ భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ను రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, డి సి ఎం ఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కొత్తగూడెంలో ని కొత్తగూడెం క్లబ్ లో మంగళవారం జరిగిన మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల పంపిణీకి వచ్చిన జిల్లా కలెక్టర్ ను కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కొత్వాల శాలువా బొకేలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం చైర్మన్ పసుపులేటి వీరబాబు, కొత్తగూడెం సొసైటీ చైర్మన్ మండే వీర హనుమంతరావు, పాల్వంచ మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న గౌడ్, వై వెంకటేశ్వరరావు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## పగిలిన మిషన్ భగీరథ పైపు... అధికారులు చూడరు అటువైపు

- ప్రధాన రహదారి కూడలి వద్ద పగిలిన పైపులైన్
- వృధాగా పోతున్న నీరు.



**జూలూరుపాడు నవంబర్ 25( ప్రజా జ్యోతి):** జూలూరుపాడు మండల కేంద్రంలోని పాపకొల్లు క్రాస్ రోడ్డు వద్ద మిషన్ భగీరథ పైపులైన్ పగిలి వారం రోజుల నుంచి నీరు వృధాగా పోతున్న ఎవరికి చెప్పాలో అర్థం కాని పరిస్థితి దాపురించింది. నిత్యం రద్దీగా ఉండే కూడలి వద్ద పైపు పగిలి నీరు వృధాగా పోతూ గుంతగా ఏర్పడ్డ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు స్థానిక అధికారులకు చెబితే అది మిషన్ భగీరథ వారి విధి అని చెబుతున్నారు. కానీ మిషన్ భగీరథ అధికారులు మాత్రం అందుబాటులో ఉండరు. ఏ అధికారికి చెప్పాలో తెలియని పరిస్థితి మండల వ్యాప్తంగా మిషన్ భగీరథలో ఎంతమంది పనిచేస్తున్నారో కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. ఎవరు ఎప్పుడు డ్యూటీకి వస్తారో కూడా అర్థం కాని పరిస్థితి అయితే ఎక్కడైనా మిషన్ భగీరథ పైపు పగిలిందంటే రోజులు గడవాల్సిందే ప్రజలు వాపోతున్నారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ విషయమై చర్య తీసుకొని ప్రజలకు ఇబ్బందిగా కలగకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## విద్యుత్ ఘాతానికి గురై మహిళ మృతి



**బూర్గంపహాడ్,నవంబర్ 25 (ప్రజా జ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం పినపాక పట్టి నగర్ గ్రామంలో మేకల రమాదేవి అనే మహిళ విద్యుత్ ఘాతానికి గురై మృత్యువాత పడింది. మంగళవారం ఉదయం కిరాణా దుకాణం తెరిచేందుకు వెళ్లి, షాప్ ఇనుప డోర్ పట్టుకోగా.. అప్పటికే అందులో విద్యుత్ ప్రవహించడంతో ఆమెకు ఊహించని విధంగా షాక్ తగిలింది. విద్యుత్ ధాటికి ఆమె అక్కడికక్కడే విగత జీవిగా మారారు. ప్రమాదవశాత్తు జరిగిన విద్యుత్ లీకేజీ కారణంగానే ఇనుప డోర్ కు కరెంట్ సరఫరా అయ్యి ఉంటుందని అనుమానిస్తున్నారు. హుటాహుటిన కుటుంబ సభ్యులు పాల్వంచలోని ఓ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. చిన్న వయసులోనే పిల్లలు తల్లిని కోల్పోయారంటూ బంధుమిత్రులు కన్నీరుమున్నీరయ్యారు.

# కార్మికుల హక్కులను కాలు రాస్తున్న నూతన చట్టాలు

- నాలుగు లేబర్‌కోడ్‌ల అమలుతో శ్రామిక వర్గంపై దాడి
- కార్మిక ప్రజా సంఘాలు చేపట్టిన నిరసనలకు సిపిఎం సంపూర్ణ మద్దతు
- సామినేని రామారావు హత్య కేసు చేదించడంలో పోలీసుల నిర్లక్ష్యం
- పాత్రికేయుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు



**కొత్తగూడెం నవంబర్ 25 (ప్రజా జ్యోతి ):** నాలుగు లేబర్‌కోడ్‌ల అమలు కోసం కేంద్రం నోటిఫికేషన్ విడుదల చేయడం శ్రామికవర్గంపై దాడి అని, దీన్ని రాష్ట్రాలు కచ్చితంగా అమలు చేయాలని కేంద్రం ఒత్తిడి చేయడం అప్రజాస్వామికమని, హక్కులనూ కాలరాయడ మేనని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక మంచికంటి భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యాజమాన్యాలకు పూర్తి అనుకూలంగా లేబర్‌కోడ్‌లు తెచ్చి, అమలు చేయాలని రాష్ట్రాలపై ఒత్తిడి చేస్తూ కేంద్రం తెచ్చిన నోటిఫికేషన్‌ను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఈ కోడ్‌లు కార్మికవర్గానికి తీవ్ర నష్టం కలిగిస్తాయని తెలిపారు. ఈ లేబర్‌కోడ్‌లలో కనీసవేతనం నిర్వచనాన్ని అస్పష్టంగా పేర్కొన్నారని అన్నారు. కార్మిక యూనియన్లకు సమ్మె చేసే హక్కును, వేతనాల కోసం యజమాన్యంతో చర్చించే హక్కునూ లేకుండా చేశారని విమర్శించారు. కార్మికశాఖను పనికిరాని సంస్థగా మార్చేశారని, అధికారులను ఫెసిలిటేటర్లుగా పేర్కొన్నారని తెలిపారు. గిగ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించలేదని తెలిపారు. కార్మిక రంగం రాష్ట్రాల పరిధిలో ఉంటుందని, దాన్ని కూడా కేంద్రం పరిధిలోకి తీసుకుంటోందని విమర్శించారు. కేరళ వంటి రాష్ట్రాల్లోనూ ఇలాంటి అప్రజాస్వామిక చట్టాలు అమలు చేయాలని ఒత్తిడి చేస్తోందని, వీటిని అంగీకరించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కార్మికవర్గంపై దాడి చేయడం అంటే మొత్తం ప్రజలపైదాడి చేయడమేనని తెలిపారు. దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఈనెల 26న కార్మిక సంఘాలు చేపట్టిన ఆందోళనను సీపీఐ(ఎం) పూర్తిగా సమర్థిస్తుందని తెలిపారు. ఆపరేషన్ కగార్ పేరుతో గిరిజనులపై దాడి ఎన్‌కౌంటర్ల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం మావోయిస్టులను కాల్చి చంపుతోందని, ఆపరేషన్ కగార్ పేరుతో గిరిజన ప్రజానీకంపై యుద్ధం చేస్తోందని తెలిపారు. కార్పొరేట్ సంస్థలు అడవి, సహజ వనరులు, ఖనిజాల పై కన్నేశాయని, వాటికోసం మావోయిస్టుల ఎన్‌కౌంటర్ల పేరుతో గిరిజనులను తరిమేసి, అడవులను కార్పొరేట్లకు అప్పగించడం కోసం కేంద్రం చేస్తున్న కుట్రల్లో భాగమే మావోయిస్టుల హత్యలని అన్నారు. ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్లన్నీ బూటకమని, వేర్వేరు చోట్ల తలదాచుకున్న వారందరినీ పట్టుకెళ్లి కాల్చి చంపుతున్నారని తెలిపారు. తేమ శాతం పేరుతో పత్తి పంట కొనుగోలు చేయకుండా ఆంక్షలు పెడుతున్నారని అన్నారు. ఏడు క్వింటాలు మాత్రమే కొంటానని మొదట చెప్పినపుడు రైతాంగం వ్యతిరేకించడంతో పన్నెండు క్వింటాలు కొంటామని అధికారులు చెప్పారని కానీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మాత్రం కొనట్లేదని ఆరోపించారు. తేమతో సంబంధం లేకుండా మొత్తం పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం సీనియర్ నాయకులు సామినేని రామారావును హత్య చేసిన దోషులను పట్టుకొని శిక్షించడంలో పోలీస్ యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తున్నారని ఆరోపించారు. రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా నిష్పక్షపాతంగా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోలీసుల తీరుకు నిరసనగా కూడా ఆందోళన చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు.

**ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా జిల్లా అభివృద్ధికి ఇచ్చిన హామీలు అమలు చేయాలి**

**సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య**

జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన ఉంటుందని ప్రకటనలు వస్తున్నాయని ఈసారి జిల్లాకు వస్తున్న ముఖ్యమంత్రి ఎన్నికలకు ముందు ఈ జిల్లా అభివృద్ధికి ఇచ్చిన హామీలను అమలు చేయడానికి కృషి చేయాలని కోరారు. జిల్లాలో ఎర్త్ యూనివర్సిటీ ప్రారంభోత్సవానికి వస్తున్న ముఖ్యమంత్రి ఈ జిల్లా సాగునీటి వనరుకు ప్రధాన ప్రాజెక్టు అయినటువంటి సీతారామ ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తి చేసి జిల్లాకు నీరు అందించే కృషి చేయాలని డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి అవసరమైన నిధులు కేటాయించాలని అందుకు ముఖ్యమంత్రి పర్యటన ఈ జిల్లాకు ఉపయోగపడాలని ఆయన సూచించారు. జిల్లాలో ఉన్న ప్రధాన సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురావడానికి ముఖ్యమంత్రిని కలిసే అవకాశం సిపిఎం బృందానికి కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ కే బ్రహ్మాచారి లిక్కి బాలరాజు పాల్గొన్నారు.

## రామాలయంలో దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్టాపన

- భక్తులకు మహా అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించిన మడత దంపతులు





**ఇల్లందు, నవంబర్ 25, ప్రజా జ్యోతి:** పట్టణంలోని 8వ వార్డులో గల శ్రీ రామాలయంలో మంగళవారం దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమం వేదపండితుల పూజల నడుమ ఎంతో అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో ఇల్లందు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మడత రమ – వెంకట్ గౌడ్ దంపతులు, వారి కుమార్తె మడత ఆద్యలు పాల్గొని ఇల్లందు పట్టణ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆ భగవంతుడిని వేడుకున్నారు. అనంతరం ఇల్లందు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మడత రమ – వెంకట్ గౌడ్ దంపతుల ఆధ్వర్యంలో ఏక్తా హౌజ్ ప్రాంగణంలో మహా అన్న ప్రసాద కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కోరం కనకయ్య – లక్ష్మి, ఇల్లందు డిఎస్పీ ఎన్. చంద్రభాను దంపతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలు, ఏక్తా హౌజ్ సభ్యులు పాల్గొన్నారు.

## నాలుగు లేబర్‌కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలి

- నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపిన ఐఎఫ్టియు

**కొత్తగూడెం, నవంబర్ 25(ప్రజాజ్యోతి ):** నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఐఎఫ్టియు రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం బాబు క్యాంప్ ఏరియాలో నల్ల జండాలతో బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం ఎస్సిసిడబ్ల్యూయు రాష్ట్ర సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి ఎన్ సంజీవ్ పిలుపునిచ్చారు. నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ కరోనా సమయాలు తీసుకొచ్చిన సవరణల పేరుతో నేడు నాలుగు లేబర్ కోడ్ లుగా చేసి కార్మికుల హక్కులను పని దినాలను పని భద్రతను సమయపాలన ఇలాంటివి ఎన్నో హక్కులను కాలరాస్తూ ఈ చట్టాలు తీసుకొస్తున్నారని ఈ చట్టాలు మొత్తం కూడా కార్పొరేట్ శక్తులకు కాంట్రాక్టర్లకు ఉపయోగపడేవిగా ఉన్నాయని విమర్శించారు. నేడు వస్తున్న పరిస్థితుల్లో కార్పొరేట్ శక్తులు కార్పొరేట్ కంపెనీలు బడా కంపెనీలకు పెట్టుబడిదారులకు యూనియన్లు అడ్డుగా ఉన్నాయని ఆ యూనియన్లను లేకుండా చేయడం కోసమే ఈ నల్ల చట్టాలను తీసుకొస్తున్నారని తక్షణమే కార్మికులని ప్రమాదంలోకి నెట్టే కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు రాధా, నిర్మల, కృష్ణ, రామకృష్ణ, నరసింహ, కరుణ తదితరులు పాల్గొన్నారు.



# వడ్డీ లేని రుణాలతో మహిళల పొదుపు శక్తి, వ్యాపార దక్షత పెరుగుతోంది

- కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు
- మహిళా శక్తితో జిల్లా అభివృద్ధి వేగవంతం అవుతుంది
- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్





**కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 25, ప్రజా జ్యోతి:** మహిళలకు వడ్డీ లేని రుణాల పంపిణీ కార్యక్రమం మంగళవారం కొత్తగూడెం క్లబ్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ , కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా రూ.304 కోట్ల విలువైన వడ్డీ లేని రుణాలు విడుదల కావడం మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడుతుందని అన్నారు ,రుణాలను క్రమశిక్షణతో తిరిగి చెల్లించడం వ్యాపార దక్షతను పెంపొందిస్తుందని, పెట్రోల్ బంకులు, బస్సులు, సోలార్ ప్లాంట్లు వంటి రంగాల్లో మహిళల భాగస్వామ్యం పెరుగుతుందని అన్నారు, ఇందిరమ్మ చీరల పంపిణీ సందర్భంగా మహిళలో కనిపించిన సంతోషం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని తెలిపారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పటికీ ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి, రేషన్ కార్డుల మంజూరు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు వంటి సంక్షేమ పథకాలు ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయని అన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ జిల్లాకు మొత్తం రూ.10 కోట్లు 74 లక్షల విలువైన వడ్డీ లేని రుణాలను ప్రభుత్వం మంజూరు చేసింది అని తెలిపారు. అశ్వరావుపేటకు రూ.2.70 కోట్లు, భద్రాచలంకు రూ.1.51 కోట్లు, కొత్తగూడెంకు రూ.1.97 కోట్లు, పినపాక రూ.2.66 కోట్లు, ఇల్లందుకు రూ.1.38 కోట్లు కేటాయించగా, మొత్తం 11,423 మహిళా సంఘాలకు లబ్ధి చేకూరిందని వివరించారు. రుణాలను సమర్థవంతంగా వినియోగించుకొని కొత్త పరిశ్రమలను స్థాపించి మహిళా కుటుంబాలు ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు.జిల్లా వైపు రాష్ట్ర, జాతీయ స్థాయి పరిశ్రమలు ఆసక్తి గా చూస్తున్న నేపథ్యంలో మహిళా సంఘాలు కొత్త సాంకేతిక పద్ధతులను, ప్రయోగాత్మక యూనిట్లు, మరిన్ని ఏర్పాటు చేస్తే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ఇటీవల జిల్లాకు లభించిన 'జల్ సంచయ్–జన్ భాగీదారీ' జాతీయ అవార్డు మహిళా సంఘాల సమిష్టి కృషి ఫలితమే అని కలెక్టర్ అన్నారు. మహిళ సమాఖ్య సభ్యులు పలుగు పార పట్టి ఇంకుడు గుంతలు త్రవ్వడం ద్వారానే ఇది సాధ్యమైంది అన్నారు. అదేవిధంగా, అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా జిల్లాలోని అన్ని పాఠశాలల మరమ్మతులు పూర్తి చేసామని, పాఠశాలలలో శానిటేషన్ కోసం కూడా నిధులు విడుదల చేయడం జరుగుతుందని అమ్మ ఆదర్శ కమిటీ పర్యవేక్షణలో పాఠశాలలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు.ఇంటి ఆవరణలో చిన్న యూనిట్లు ఏర్పాటు చేయడం ద్వారా మహిళలు మంచి ఆదాయం ఆర్జించవచ్చని, బ్యాంకుల నుండి అవసరమైన సహకారం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలో 50 శాతం అటవీ ప్రాంతం ఉన్న నేపథ్యంలో అటవీ ఉత్పత్తుల ఆధారంగా మరిన్ని యూనిట్లు స్థాపించేందుకు మహిళలు ముందుకు రావాలి అని పిలుపునిచ్చారు. ఫర్నిచర్ తయారీ శిక్షణలో మహిళల అధిక పాల్గొనడం మహిళా శక్తి ప్రతిభకు సాక్ష్యమని అన్నారు. అనంతరం లబ్ధిదారులకు కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ,జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమం లో సహకార సంఘ అధ్యక్షులు మండే హనుమంతరావు, మాజీ డిసిసిబి చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, కొత్తగూడెం తాసిల్దార్ పుల్లయ్య,అదనపు డి ఆర్ డి ఏ నీలేష్ డ్వాక్రా సంఘాలు సభ్యులు పాల్గొన్నారు.

# వలస ఆదివాసీలకు పోడుపట్టాలు, కుల ధృవీకరణ పత్రాలు ఇవ్వాలి

- వ్య.కా.సం. జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు ఎల్లయ్య
- ఐటిడిఏ ముందు ధర్నా



**భద్రాచలం టౌన్, నవంబర్ 26(ప్రజాజ్యోతి ):** బ్రతుకు తెరువు కోసం పొట్ట చేత పట్టుకుని వలసలు వచ్చిన ఆదివాసీల సాగులో ఉన్న పోడుభూములకు పట్టాలివ్వాలని, వారి పిల్లల చదువులు కోసం కులధృవీకరణ పత్రాలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు ఎల్లయ్య అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఐటిడిఏ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రేసు మాట్లాడుతూ పరిస్థితులు అనుకూలించక బ్రతుకు జీవుడా అంటూ అటవీ ప్రాంతాలకు వలసలు వచ్చి అనేక మంది ఆదివాసీలు జీవనం సాగిస్తున్నారని, దశాబ్దాల కాలంగా వారు నివసించే అటవీ ప్రాంతాల్లో పోడుసాగు చేసుకుని వ్యవసాయం చేస్తున్నారని చెప్పారు. వలసల వానులను ఇక్కడి అధికారులు ద్రోహులు చిత్రీకరించి వారు సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలివ్వకుండా వేదింపులకు గురిచేస్తున్నారని, అటవీ అధికారులు సైతం వంటలను ధ్వంసంకేసులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని పౌరులైన ఆదివాసీలు అడవుల్లో జీవించే హక్కుతో పాటు స్వదేశంలో ఏ మూలైనా బ్రతికే హక్కు ఉందని, దీనిని కాదనే అధికారం ఎవ్వరికీ లేదన్నారు. అమాయక ఆదివాసీలపై అధికారులు పెత్తనం చేస్తూ ఇష్టాను సారంగా వ్యవహరించడం సరైంది కాదని మండిపడ్డారు. బడాబాబులు కంపెనీలు నెలకొల్పుకునేందుకు నామమాత్రపు ధరకు వందలాది ఎకరాల భూములను దారాదత్తం చేస్తున్న ప్రభుత్వాలు ఆదివాసీల సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలిచ్చేందుకు ఎందుకు వెనుకంజ వేస్తున్నారని ప్రశ్నించారు. కుర్చీ వేసుకుని పోడుపట్టాలు పంపిణీ చేస్తామని చెప్పిన బిఆర్ఎస్ ముఖ్యమంత్రి కొద్ది మందికి మాత్రమే పోడుపట్టాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని, అధికారంలోనికి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించి ఆదివాసీలకు న్యాయం చేయాలన్నారు. మరో ప్రక్క ఆదివాసీల పిల్లలకు కుల ధృవీకరణ పత్రాలు ఇచ్చేందుకు రెవెన్యూ అధికారులు కొర్రీలు పెడుతున్నారని, వలన వచ్చినంత మాత్రనా వారి పిల్లలు చదువుకోకుండా బ్రతుకులు ఎదుగూ బొదుగూ లేకుండా ఆగిపోవాల అన్నారు. ఇప్పటికైనా అధికారులు ఆదివాసీల పిల్లల చదువులను ప్రోత్సహిస్తూ వారికి కుల ధృవీకరణ వత్రాలు మంజూరీ చేయాలని డిమాండ్ చేశారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో రహదారి సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మౌళిక నదుపాయాలు కల్పించాల్సిన ప్రభుత్వాలు పట్టణాలపై మాత్రమే దృష్టి పెడుతున్నాయని, ఇప్పటికైౖ మారుమూల గ్రామాల సమస్యల పరిష్కారానికి ఐటిడిఏ కృషి చేయాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం అధికారులు చొరవచూపకుంటే దశలవారీ ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఐటిడిఏ కార్యాలయ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు సాధనపల్లి సతీష్, మాజీ జెడ్పిటిసి గుగ్గిళ్ల లక్ష్మీ, యువజన నాయకులు వజ్రా నరేష్ వ్యవసాయకార్మిక సంఘం నాయకులు మడకం దేవా, మాదయ్య, అనీల్, రాంబాబు, కోవాసి లక్ష్మయ్య, కలమ బుజ్జయ్య, వంజం సోనా, కుంజా భీమయ్య, మేడ్ బత తదితరులు పాల్గొన్నారు.

# అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వాలి

- రైతు సంఘం మండల కార్యదర్శి మచ్చ రామారావు




**చర్ల , నవంబర్ 25: (ప్రజా జ్యోతి ):** చర్ల మండల కేంద్రంలో సోమవారం లెనిన్ కాలనీలో కనుకు భద్రం అధ్యక్షతన రైతు సంఘం జనరల్ బాడీ సమావేశంలో జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం మండల కార్యదర్శి మాచ్చ రామారావు మాట్లాడుతూ. 1964లో 32 మంది కుటుంబాలకు ఆనాడు ప్రభుత్వం ఇచ్చినటువంటి భూమిని ఈరోజు వరకు సాగు చేస్తూ ఉంటున్న ఏజెన్సీ ప్రాంతంలో ఉన్నటువంటి మాకు ఈ రోజు వరకు కూడా ఎటువంటి హక్కు పత్రాలు ప్రభుత్వం వారు కల్పించలేదు అని ప్రభుత్వానికి పలుదపాలుగా ప్రతి పత్రాలు సమర్పించాము అని 2018 2019లో సర్వే చేసి ప్రభుత్వం గాలికి వదిలేసారు అని ప్రస్తుత ప్రభుత్వం అసైన్డ్ భూములకి పట్టాలిస్తామని చెప్పిన ఎటువంటి కార్యచరణ చేయడం లేదనిఅట్టి అసైన్డ్ భూమికి మాకు హక్కు పత్రాలను కల్పించాలని ప్రభుత్వాన్ని రైతు సం ఘం మండల కార్యదర్శి మచ్చ రామారావు ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం వారు హక్కు పత్రాలను కల్పించని యెడల దశలవారి పోరాటాలు చేస్తామని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలోదొడ్డా వెంకటేశ్వరరావు చింతల మల్లికార్జున్ ఏకుల మహేష్ రుంజ కృపా నాదం సంబంధిత హక్కుదారులు అందరు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ చీరల పంపకాల్లో గ్రామ దీపికలు అలసత్వం

- తమ ఇంటి వద్దనే చీరలు పంపిణీ చేస్తున్న వైనం.




**జూలూరుపాడు నవంబర్ 25ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలంరాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. మొదటి విడతలో భాగంగా రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో చీరలు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఇందిరమ్మ చీరల పంపిణీ బాధ్యతను ప్రభుత్వం సర్ఫ్ సిబ్బందికి అప్పజెప్పడంతో వారు గ్రామ దీపికల సహాయంతో గ్రామాల్లో ఇందిరమ్మ చీరలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. అయితే జూలూరుపాడు మండల పరిధిలో మాత్రం ఇందిరమ్మ చీరల పంపిణీ దేవుడు వరమిచ్చిన పూజారి కనకరించలేదు అన్న చందాగా మారింది. ప్రభుత్వం ఓవైపు ఇందిరమ్మ చీరలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేస్తే, జూలూరుపాడు మండలంలో మాత్రం అందుకు భిన్నంగా ఇందిరమ్మ చీరలు పంపిణీ కార్యక్రమం కొనసాగుతుంది. మండలంలో కొందరు గ్రామ దీపికలు ఇందిరమ్మ చీరల పంపకాల్లో అలసత్వంగా వ్యవహరిస్తున్నారు. ఇందిరమ్మ చీరలు కావాలంటే స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఫోన్ చేసి తమ ఇంటికి వద్దకే వచ్చి చీరలు తీసుకువెళ్లాలని ఆదేశాలు జారీ చేస్తున్నారు. గ్రామ దీపికల తీరుపై కొందరు స్వయం సహాయక సంఘాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు ఓ పక్క ఇంటింటికి వెళ్లి చీరలు పంపిణీ చేయమని చెబుతున్నప్పటికీ కొందరు గ్రామ దీపికల తీరు మాత్రం మారట్లేదు. తమ ఇళ్ల వద్దనే ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తూ అధికారుల మాటలను పెడచెవిన పెడుతున్నారు. ఇందిరా క్రాంతి పదంలో పనిచేస్తున్న గ్రామ దీపికలకు మాత్రం ఒంటెద్దు పొగడ పోతున్నారని, మండలాధికారులు చెప్పినప్పటికీ గ్రామదీపికల వ్యవహారలో మాత్రం లెక్కచేయని పరిస్థితి ఉందని కొందరు మహిళలు ఆరోపిస్తున్నారు. గ్రామ దీపికల తీరితో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మల చీరల పంపిణీ కార్యక్రమం అభాసపాలవుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నత అధికారులు స్పందిం చి ఇందిరమ్మ చీరలు పంపిణీ కార్యక్రమాన్ని వేగవంతం చేసి లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసే విధంగా చూడాలని మహిళలు కోరుతున్నారు.

# ఐటీడీఏ భద్రాచలం ఎదుట నిరసన ప్రదర్శనను విజయవంతం చేయండి

- టి.పి.టి.ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.రాజు

**భద్రాచలం టౌన్, నవంబర్ 25(ప్రజాజ్యోతి ):** గిరిజన సంక్షేమ శాఖ పని చేసిన పండిట్ , పి ఈ టీ లను అప్గ్రేడేషన్ చేయాలని ప్రమోషన్ ఇవ్వాలని సి ఆర్ టి లకు, డైలీ వేజ్ వర్కర్లక మినిమం టైం స్కేల్ ఇవ్వాలని ఫ్లెక్సీ తో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా టి పి టి ఎఫ్ సభ్యులు హిందీ పండిట్ గ్రేడ్ 2 గూగులోత్. నరేష్ మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ అధికారి పరిధిలోని తెలుగు పండిట్ .,హిందీ పండిట్లకు వ్యాయామ ఉపాధ్యాయులకు అప్గ్రేడేషన్ పూర్తయి సంవత్సరకాలం అయినా గాని గిరిజన సంక్షేమ శాఖలో పండిట్ పీఈటీల వ్యాయామ ఉపాధ్యాయుల ఆఫ్ గ్రేడేషన్ చేయకపోవడం చాలా బాధాకరమని ట్రైబల్ వెల్ఫేర్ టీచర్లు కూడా తెలంగాణ రాష్ట్రంలోనే పనిచేస్తున్నామని,ఈ రాష్ట్రంలో ఏ ప్రభుత్వ జీవో విడుదలైన విద్యా శాఖలో అందరికీ వర్తించేలా ఉన్నప్పటికీ ట్రైబల్ వెల్ఫేర్ లో వర్తింప చేయడానికి వచ్చిన ఇబ్బంది ఏమిటో అర్థం కావట్లేదని, ఇప్పటికైనా గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు ట్రైబల్ మినిస్టర్ చొరవ తీసుకుని సమస్యలు పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా సమస్యల పరిష్కారం కోసం జరిగే నిరసన ప్రదర్శనకు పండిట్స్, పిఈటిలు సి ఆర్ టి లు డైలీ వేజ్ వర్కర్లు 26 నవంబర్ 2025 ఉదయం 10 గంటల ప్రారం భం సకాలంలో హాజరుకావాలని కోరారు . ఈ కార్యక్రమంలో జి లతా, డి సుజాత, మురళి, ఉమామహేశ్వరరావు, పి శ్రీనివాసరావు, ఐ సరిత, భీముడు పాల్గొన్నారు.



# బిఆర్ఎస్ లో అంతర్గత పోరు

- మండల అధ్యక్షుల పదవులతో అసమ్మతి సెగ
- బిఆర్ఎస్ జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశం
- సమావేశం ముగిశాక హాజరైన వనమా
- మౌనంగా ఉన్న హరి ప్రియ
- భద్రాచలం నుంచి నాయకులే తప్ప హాజరు కాని కార్యకర్తలు





**కొత్తగూడెం నవంబర్ 25 (ప్రజా జ్యోతి):** జిల్లా బిఆర్ఎస్ పార్టీలో అంతర్గత విభేదాలు కొనసాగుతున్నప్పటికీ ఈనెల 29న దీక్ష దివస్ ను ఉద్దేశించి బిఆర్ఎస్ జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం కొత్తగూడెం తెలంగాణ భవన్లో నిర్వహించారు. అయినా జిల్లాలోని 5 నియోజకవర్గాల నుంచి ముఖ్య నాయకులు తప్ప, కార్యకర్తలు హాజరు కాలేదని తెలుస్తుంది. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు హరిప్రియ, మెచ్చ నాగేశ్వరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేగా కాంతారావు మాట్లాడుతూ.. నా సొంత నిర్ణయాలతో జిల్లాలో పార్టీని నడపడం లేదని, అధిష్టానం నిర్ణయం మేరకే ఎవరికైనా పదవులు ఇవ్వాలన్నా, ఏ కార్యక్రమం నిర్వహించాలన్న పైన పార్టీ నిర్ణయానికి కట్టుబడే నిర్వహిస్తామన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ అభ్యర్థుల విజయం కోసం ప్రతి ఒక్కరు కష్టపడాలని అన్నారు. కెసిర్, కేటీఆర్, హరీష్ రావు తప్ప నేను ఎవరి మాటను వినను అని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ జోలికి వస్తే ఊరుకోమని మణుగూరులో పార్టీ కార్యాలయం దాడి పై 12 కేసులు నమోదయాయని, 126 రీలు నా దగ్గర ఉన్నాయని, ఎవర్ని వదిలిపెట్టమని అన్నారు.

**29న దీక్ష దివాస్:** ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాజ్యసభ సభ్యులు, కొత్తగూడెం ఎన్నికల ఇన్చార్జి వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ.. కెసిఆర్ చచ్చుడో తెలంగాణ వచ్చుడో.. అనే నినాదంతో 2001 నవంబర్ 29న కెసిఆర్ దీక్ష దివాస్ కార్యక్రమాని చేపట్టగా దాన్ని ఉద్దేశించి ప్రతి సంవత్సరం నవంబర్ 29న బిఆర్ఎస్ చేపట్టే కార్యక్రమంలో భాగంగా 29న జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో ఘనంగా నిర్వహించడానికి ప్రతి ఒక్క కార్యకర్త ముందుండి నడిపించాలన్నారు. పార్టీలో చిన్న చిన్న సమస్యలు వస్తూనే ఉంటాయని, వాటిని కూర్చొని మాట్లాడుకొని పరిష్కరించుకుంటామ న్నారు. ఈ కార్యక్రమంలో కాపు సీతాలక్ష్మి, దిండిగల రాజేందర్, మన్యం రామకృష్ణ, రాంప్రసాద్, పోశం నరసింహారావు, అనుదీప్, కొట్టి వెంకటేశ్వర్లు, బానోత్ శాంతి, కొనగల వెంకట్ రెడ్డి , సత్యనారాయణ, ముత్యాల రాజేష్, నవతన్, సింధు తపస్వి తదితరులు పాల్గొన్నారు.

## మత సామరస్యాన్ని చాటుతూ.. అయ్యప్ప స్వాములకు ముస్లిం సోదరుడి అన్నదాన కార్యక్రమం



**ఆళ్ళపల్లి. నవంబర్26. ప్రజా జ్యోతి** ఆళ్ళపల్లి మండల మర్కోడు పంచాయతీ మర్కోడు అయ్యప్ప స్వామి దీక్షాపరుల మహా పాదయాత్ర భక్తిశ్రద్ధల నడుమ శోభాయాత్రగా సాగింది. మర్కోడులోని శ్రీ రామాలయం నుంచి పాతూరు శివారులోని ఉడుములగుట్ట నరసింహ స్వామి ఆలయం వరకు స్వాములు సుమారు 12 కిలోమీటర్లు నడక యాత్ర ద్వారా చేరుకున్నారు. అక్కడ స్వామి వారిని దర్శించుకొని, భక్తి పూర్వకంగా తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ముక్తార్ పాషా దాతృత్వంకులమతాలకు అతీతంగా మానవత్వాన్ని, మత సామరస్యాన్ని చాటుతూ... ఆళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన నిర్మాణ కాంట్రాక్టర్ ముక్తార్ పాషా అయ్యప్ప స్వాములకు బిక్షా (అన్నదానం) కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ అపురూప దృశ్యం చూపరులను ఆకట్టుకుంది. ఈ పాదయాత్రలో గురు స్వాములు రణం మల్లికార్జున్, రణం శేఖర్, పొదిలా రాము, తాళ్ళపల్లి రమేష్, యాసరపు శ్రీను, మన్యం సుబ్బారావు, కోనేటి వీరభద్రాచారి, శేఖర్. యాకన్న. తాళ్లపల్లి కృష్ణహరి, ఈశ్వరోజు సద్గుణా చారి. పాయం కోటేష్, సాగర్ వల్లోజు భరత్, ఈర్ప నాగేష్. వినయ్. మోదుకుదుంపురం దయాకర్ చారి, తాళ్లపల్లి నవీన్. తదితరులు పాల్గొన్నారు.

## అంజన్నకు అభిషేకం...రామయ్యకు కల్యాణం

- దేవస్థానం నిత్యన్నదాన పథకంకు రూ.లక్ష విరాళం





**భద్రాచలం, నవంబర్ 25, ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయ ఆవరణలో ఉన్న దాసాంజనేయస్వామి వారికి మంగళవారంను పురస్కరించుకొని ప్రత్యేక అభిషేకం, తమలపాకులతో అర్చన నిర్వహించారు. నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవం గా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యాహావచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు. అలాగే దేవస్థానం నిత్యన్నదాన పథకంకు ఖమ్మంలోని దంసలాపురంకు చెందిన దుర్గినేని వెంకటేశ్వర్లు, సీతాకుమారి దంపతులు లక్ష రూపాయల విరాళం అందజేశారు.



## దమ్మపేటలో అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల దాడి

- టిప్పర్ లారీతో ముప్పై టన్నుల ఇసుక స్వాధీనం



**దమ్మపేట, నవంబర్–25, (ప్రజా జ్యోతి):–** దమ్మపేట మండలంలోని మందలపల్లి క్రాస్ రోడ్డులో అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్నట్లు గమనించిన పోలీసులు వెంటనే దాడి చేశారు. పోలీసు వారు అందించిన వివరాల ప్రకారం, దమ్మపేట పోలీసు స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ డి. బాల స్వామి నాథం వాహన తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో పైడిమళ్ల రాజేశ్ అనే లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, అతను గంటకొండ బాబు టిప్పర్ లారీ (ఎపి39 డబ్లుజి5767) లో కొవ్వూరు, అరికిరేవుల ఇసుక రాంప్ నుండి తెలంగాణ ప్రాంతానికి ఇసుకను రవాణా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పోలీసులు టిప్పర్ లారీతో పాటు ముప్పై వేల రూపాయలు విలువగల ముప్పై టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు, తెలంగాణ రాష్ట్ర మైనింగ్ అండ్ మినరల్స్ నిబంధనలు ఉల్లంఘించడంతో పాటు, ప్రభుత్వానికి నష్టం కలిగించే విధంగా మోసం చేసినందుకు సెక్షన్ 318(4) బి.యన్.యస్ క్రింద దమ్మపేట పోలీసు స్టేషన్‌లో క్రైం నంబర్ 309/2025 గా కేసు నమోదు చేశారు. దమ్మపేట పోలీసులు అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్య లు తీసుకుంటామని, ఇలాంటి నేరాలకు ఎవరూ పాల్పడొద్దని హెచ్చరించారు.

## సెమీ క్రిస్టమస్ వేడుకలు



**ఇల్లందు, నవంబర్ 25, ప్రజాజ్యోతి:** పట్టణంలోని సిఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో మంగళవారం సెమీ క్రిస్టమస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చర్చి ప్రాంగణంలో చలి మంటలు వేసి క్రిస్టియన్స్ అందరు ఆటపాటలతో ఎంతో సందడిగా గడిపారు.

## పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి

- ఐటీడీఏ కార్యాలయం ఎదుట వలస ఆదివాసీల ధర్నా



**ఆళ్ళపల్లి. నవంబర్25. ప్రజాజ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం వలస ఆదివాసీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు ఎల్లయ్య ఆధ్వర్యంలో ఆదివాసీలు ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రేసు ఎల్లయ్య (సీపీఐ పార్టీ కార్యవర్గ సభ్యులు, ఆళ్లపల్లి మాజీ వైస్ ఎంపీపీ) మాట్లాడుతూ, వలస ఆదివాసీలు సాగు చేసుకుంటున్న పోడు భూములకు వెంటనే హక్కు పత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పోడు భూముల విషయంలో ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యాలను తక్షణమే నిలిపివేయాలని ఆయన కోరారు. సాగులో ఉన్న పోడు భూములకు హక్కు పత్రాల మంజూరు. వలస ఆదివాసులకు ఎస్టీ కుల ధృవీకరణ పత్రాలు ఇవ్వాలి. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి. గ్రామాల్లో విద్య, వైద్యం, విద్యుత్, రహదారుల వంటి మౌలిక సౌకర్యాలను కల్పించాలి. ఈ కార్యక్రమంలో యువజన సంఘం (ఏఐవైఎఫ్) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సాధనపల్లి సతీష్, మాజీ జెడ్పీటీసీ గోగ్గేల లక్ష్మి, యువజన నాయకులు వజ్జ నరేష్, వలస ఆదివాసీ నాయకులు మడకం దేవా, వంజం సోనా, కొర్స మాడయ్య, అనిల్, కల్మ బొజ్జయ్య, దేవయ్య, లక్ష్మయ్య, భీమయ్య, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

## భూ వ్యవహారంలో దాడికి పాల్పడిన వ్యక్తులు అరెస్ట్

**అశ్వారావుపేట, నవంబర్ 25, ప్రజాజ్యోతి :** భూ వ్యవహారంలో కత్తులతో దాడి చేసిన ముగ్గురు వ్యక్తులను మంగళవారం పోలీసులు అరెస్టు చేసి హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఎస్ ఐ యాయాతి రాజు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నారంవారిగూడెం కాలనీలో 5 ఎకరాల వ్యవసాయ భూమి విషయంలో మంగా వెంకటేశ్వర్లు, మంగా గణేష్‌లను కర్రలతో, కత్తులతో దాడి చేసిన అదే గ్రామానికి చెందిన గేదెల విష్ణు, వినయ్, సురేష్‌లను అరెస్టు చేసి దమ్మపేట కోర్టులో హాజరు పరిచారు. ముగ్గురు నిందితులను న్యాయస్థానం రిమాండ్ విధించి సత్తుపల్లి సబ్ జైలుకు తరలించినట్లు ఎస్ ఐ యాయతి రాజు తెలిపారు.